ఈ అధికార్ల కేం :

# నీతా? జాతా?

* ముట్నూరి సంగమేశం *

"ఇహ నెన్నాళ్లోయ్ ఈ బిగుర్లు. నాలుగు — నాలుగంటే నాలుగు రోజులు కళ్లుమూసి చూడూ" అంటున్నాడు కరణం రామన్న పంతులు బావమరిదితో. బావమరిది ముఖం కొంచెం వికసించింది. ఏదో ఆశ ఆ కళ్లల్లో తాండవించి నట్టయింది. అతడి కావాక్యం మళ్లా మళ్లా వినాలని అనిపించింది.

"ఏదో బావా! ఈ విషయంలో నీ తెలివి తేటలన్నీ ఉపయోగిస్తేగాని మరి ప్రయోజనం వున్నట్టు లేదు" అన్నాడు బావమరిది.

"అయితే నేనన్న మాటలో నమ్మకం లేదా? అయ్యో ప్రారబ్ధమా! వారం రోజులు తిరక్కుండా వాణ్ణి త్రోసిరాజు చేసి నిన్నాగద్దె ఎక్కిస్తానని వాగ్దానం చేస్తున్నా. నమ్మవా?" అన్నాడు కరణం తన ప్రయోజకత్వంమీద పదహారణాల నమ్మకంతో.

"ఏమో, నీ దయ" అంటూ లేచి అరుగు దిగి యింటిముఖం పట్టేడు బావమరిది.

ఇదంతా వింటూన్న వెంకట్రావుకి మతిపోయి నట్టయింది. సెలవుల్లో పల్లెటూళ్లోవుండి, గ్రామ జీవనాన్ని అధ్యయనం చేదాంగదా అని బయల్దేరి పినతండ్రిగారైన కరణంగారి యింట్లో దిగేడు వెంకట్రావు. చావిట్లో కూర్చొనే అన్ని సంగతులూ అత్యంతం కనిపెడుతున్నాడు. 'పల్లెలకు మరలండి, పట్నాలు వదలండి' అని పట్నంలో కూర్చొని వ్యాఖ్యానిస్తూన్న పెద్దపెద్దల మాటలు యితనికిప్పుడెంతో వెగటనిపిస్తున్నాయి. ఇక్కడ రోజూ జరిగే లాలూచీలు, పేచీలు, తగవులు, అన్యాయాలు, అతడి గుండె బేజారెత్తించేస్తున్నాయి. కరణంపదవిలో వున్న తన పినతండ్రి తెల్లవారి లేచింది మొదలు ఎన్ని గొంతుకలు కోస్తున్నాడో అని లెక్కవేస్తే అతడికి రాత్రి నిద్రపట్టనంత కంగారు పుట్టింది. ప్రత్యక్షనరకంగా వున్న పల్లెటూరుమీద ఓ బాంబుపడిపోతే నయమేమో అనే భావనకూడా అతనికి కలక్కపోలేదు. తన పినతండ్రితో వాదించి ధర్మాధర్మాలు నిర్ణయించే తాహతుగాని, వాగాటీగాని, అనుభవంగాని తనకు లేకపోవడం అతణ్ణి మరింత క్రుంగదీస్తూంది.

"ఏమిటి బాబయ్యా యిదంతాను" అన్నాడు వెంకట్రావు. "మామయ్యకేమిటి ఉపకారం చేస్తానంటున్నారు?"

"ఏమీ లేదు. ఈ ఊళ్లో కోపరేటివ్ సొసైటీ ఒకటుంది. దానికి ప్రెసిడెంటుగా చేయిద్దామని."

"అందులో ఏమైనా జీతం గనకనా? దాని కోసం ఎందుకీ తాపత్రయం."

"వెధవ జీతం. జీతం ఎందుకోయ్ వెర్రిగాని. సుక్షేత్రంగా నెలకి వందరూపాయలు చేజిక్కించుకోవచ్చు. ఏమీ లేకపోతే ఆ వెధవ మాదునూరి నాయుడు రెండేళ్ళయిందో లేదో మూడు యిళ్లు కట్టాడు. నాలుగుభూములు తనఖా పట్టాడు. ఓ సంచి వడ్డీకిచ్చేడు."

"అతణ్ణి తప్పించి యీ పని మామయ్యకి దఖలు పరచాలనా యీ ప్రయత్నం."

"కాకపోతే? తెలివైనవాడు, మనవాడు బ్రాహ్మణుడంటూ వుంటే ఇంకోవాడి నౌకరీలో బాగుపడడమేమిటోయ్. అదీ కాక మామయ్యని నిలబెట్టేమంటే, పేరే అతడిదిగాని తక్కిన కార్యకలాపం అంతా మనచేతిమీదనే నడవాలి. ఊరక కూచ్చుని ఏంజేస్తాడ్లె. అందుకు ఈ ప్రయత్నం."

"మొదట్లోనే మీరెందుకు ప్రయత్నించేరు కారు!" అన్నాడు వెంకట్రావు.

"అప్పుడు ప్రారంభంలో మనకి ప్రయోజనం లేదు. ఇప్పుడు నాడు ఏర్పాటుచేసిన మామూళ్లు, దొంగఫీజులు దగాలన్నీ మనకి మరి నింద తెప్పించవు. కాని అప్పట్లో యీ సొసైటీకి యింత మంది మెంబర్లు యిన్ని కాతాలు ఏమీ లేవు. ఇప్పుడు మంచిలాభసాటిలో వుంది కాబట్టే మనకి కావాలని యీ తాపత్రయం."

"ఇది ఆనరరీ నౌకరీగదా, మరి అతడి ప్రెసిడెంటుగిరీలో యీ సొసైటీ వృద్ధి పొందినపుడు అతణ్ణి ఎల్లా తప్పించేయ్యడం" అన్నాడు వెంకట్రావు సంపూర్తిగా యీ పైశాచికప్రబంధం అంతా వినాలని.

"దానికేముందోయ్. వెండిచెప్పుతో కొడితే

దేవుడికైనా తగిలితీరుతుంది. తలచినట్టు తీరుతుంది. తలచిన కార్యం అవుతుంది. అందుకేగా నీతో ఎన్నోసార్లు అన్నాను. చదివి లాభంలేదోయ్. అనుభవం కావాలోయ్ అని" అన్నాడు కరణం తన కార్యకుశలతమీద గర్విస్తూను.

వెంకట్రావుకి మరి ప్రశ్నించాలనిపించలేదు. వందో యాభయ్యో పారేస్తే లొంగిపోయే అధికార్లు మీద ఉన్నప్పుడు, స్వలాభమే పరమప్రయోజనంగా ఉన్న ఆసాములు క్రింద ఉన్నప్పుడు యీ సొసైటీలు గ్రామంలో ఉన్న రైతుకెంతమాత్రం ఉపకరిస్తాయో అతడికేం బోధపడలేదు. అక్కడికీ తెగించి అన్నాడు పినతండ్రితో: "ఏదో, అన్యాయంగా ఆర్జిస్తామని, ముందు వందో యాభయ్యో లంచాలు పోసి యీ ఉద్యోగం గడించకపోతే ఏం" అని వినీ వినపడకుండా.


"వందా! అయిదువందలు పోతే ఏమిటోయ్. పట్టుదల. మనం ఉండంగా సూరిగాడు ప్రెసిడెంటుగా ఉండి సంపాదించేడంటే అది మనకి చిన్నతనం గాదోయ్. చూడు. పాపంగానీ పుణ్యంగాని యీ పాటిగడ్డమీద మన చేతిమీద జరగవలసిందే గాని యింకోడికి యిందులో భాగం లేదనుకో" అన్నాడు గర్జిస్తూ కరణం రామన్నపంతులు.

వెంకట్రావుకి అతనితో వాదించి లాభంలేకపోయింది. ఆ మెదడుని మార్చడానికి తను చదివిన చదువు చాలదని నిశ్చయించుకొన్నాడు. అయినా మామయ్యతో కూడా ప్రస్తావిద్దామని చూసేడు. పోనీ! వీళ్లు న్యాయంగా ఆ ఉద్యోగాన్ని నిర్వహిస్తారేమో అంటే అదీ లేదాయె. అన్యాయంగానైనా ఆర్జిద్దామనే స్థిరసంకల్పంతోటే వీళ్లా ప్రయత్నం చేస్తూఉంటే అతడికి చాలా అసహ్యం వేసింది.

ఆ సాయంత్రం కరణం బావమరిది మూడు వందలు తెచ్చి కరణం చేతిలో పోసేడు. ఖర్చులకని. తన, పర, భేదం లేని కరణంగారందులో ఓ వంద స్వాహా చేసి మిగిలింది అధికార్ల ఎపాన్న కొట్టెయ్యడానికి పట్నం తర్లి వెళ్ళారు. ఓ వంద సంతకాలతో ఉన్న ఆయుధం ఓటి స్వహస్తాల్తో అధికార్లకి అర్పించేరు. మీసం మెలివెట్టి తిరిగి తన చావిట్లో కాలుమోపేరు.

వారంరోజుల్లో దిగింది ఆ పల్లెటూరికి అధికారగణం. అంతా ఎంక్వయిరీయే. అన్నీ వాఙ్మూలాలే. ఓ! ఆ రోజు పంచభక్ష్య పరమాన్నాల్తో కరణంగారి యింట్లో విందులు. కట్నాలు, కబుర్లు

## - మనుమని 'మహదాశయం -



"తాతా! మా పిల్లలందరికీ పిల్లల పత్రికలున్నాయి. నాన్నకి పేపరుంది. అన్నయ్యకి పత్రికలున్నాయి, అమ్మకీ ఆడవాళ్ల పత్రికుంది. ఇంక లేనిదల్లా నీకూ, అవ్వకీ ఒక్క పత్రికా లేదు. అంచేత మీలాంటి ముసిలాళ్ళకి "కుక్కిమంచం" అనే పేరుతో ఒక పత్రిక పెట్టదల్చుకున్నాను. దానికి నీవు సంపాదకుడువి, అవ్వ సహాయసంపాదకురాలుగా ఉండాలని నా కోరిక."

---

గుసగుసలు, గూడుపుఠాణీలు, యింకా యింకా ఎన్నో వెంకట్రావు కళ్ళముందు జరిగేయ్.

అధికార్లు వెళ్ళిపోయిన దగ్గరనుంచీ కరణంగారు మరీ గర్విస్తున్నారు తన ప్రతాపానికి. కరణంగారి బావమరిది లోలోపల లొట్టలు వేస్తున్నాడు. సూరినాయుడుమాత్రం నిమ్మకి నీరెత్తినట్టున్నాడు.

దీని పర్యవసానం ఏమిటో చూద్దాం గదా అని కూర్చున్నాడు వెంకట్రావు. అదే ఊళ్ళో వారం రోజులు గడిచింది. పదిహేనురోజులయింది. కాని ఏ కాగితమూ రాలేదు. కరణంగారికి అవ రాను కున్నట్టుంది ఆలస్యం అయినకొద్దీని. ఉన్నట్టుండి పట్నం వెళ్లారు. కనుక్కోగా తేలిందేమంటే, ఆ పిటీషనులో అన్నీ అబద్ధం అని ఎంక్వయిరీలో తేలిందనీ, సూరినాయుడు సొసైటీని వృద్ధిలోకి తెచ్చేడు కాబట్టి అతడే ప్రెసిడెంటుగా యీ సాలుకి ఉండొచ్చనీ అధికారి రిమార్కు అని.

"ఇదేమిటి బావా" అన్నాడు బావమరిది.

"వెధవ సూరిగాడు మనకంటే ఎక్కువ పోసేడోయ్. ఈ ఆఫీసర్లకేం నీతా? జాతా?" అన్నాడు కరణం.

వెంకట్రావు లోలోపల నవ్వుకున్నాడు.